క్లుప్తంగా

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్‌లో ఈ కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత ఆధ్వర్యంలో బుధవారం సీతారామపురం ప్రాంతంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ చేస్తున్న ఉద్యమానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు తెలిపారు.

చిత్రకారుడు సన్నాల మృతి తీరనిలోటు



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ పోర్ట్రెట్ (రూప చిత్రాలు) చిత్రకారుడు సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ (75) మృతి చిత్ర కళారంగానికి తీరని లోటని ప్రపంచ తెలుగు కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పీరాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సన్నాల ఈ నెల 14వ తేదీన అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. సన్నాల కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని కృష్ణలంకలోని స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. సన్నాల భౌతిక కాయాన్ని ప్రపంచ తెలుగు కళాకారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు టీవీ, కోశాధికారి ఉస్మాన్ ఖాన్, కార్యదర్శి బాలయోగి, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, చిత్రకారులు రాము, రేడాన్ సత్యం, శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు.

రైల్వేకాలనీలో పందుల సంచారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రైల్వేకాలనీలో పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. కాలనీలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. వ్యర్థాలు పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయినా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పందుల సంచారం వల్ల అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పందుల సంచారాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజారోగ్య రంగంలో ప్రైవేటు వ్యక్తులు ఎందుకు?



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబు తన వారికి లాభాలు తెచ్చేందుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కుట్రపన్నుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందర్‌పాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 32వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి, శ్యాంబాబు, సువర్ణ రాజు, బత్తుల సుబ్బారావు, పుప్పాల దుర్గాప్రసాద్, జె.వి.రెడ్డి, ఆనంత్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి బాక్స్ క్రికెట్ టోర్నమెంట్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నున్న గ్రామంలోని ఎల్ఆర్ కన్వెన్షన్ ఆవరణలో ఉన్న బాక్స్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు టెన్నిస్ బాల్ నాకౌట్ బాక్స్ క్రికెట్ స్టేట్ లెవల్ టోర్నీ జరుగుతుందని కన్వెన్షన్ చైర్మన్ దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఎల్ఆర్ కన్వెన్షన్ కార్యాలయంలో లక్ష్మణరెడ్డి బుధవారం టోర్నీ వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు 90 టీమ్‌లు పేర్లు నమోదు చేసుకున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17వ తేదీలోగా వివరాలు నమోదు చేసుకోవాలి సూచించారు. ఇందుకు 80080 07080, 80743 53466 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన యువతకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ అందిస్తామన్నారు. బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ పి.మహేష్, క్రికెట్ కోచ్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలుషిత నీరు.. తాగేదెలా సారూ..

- కుళాయిల నుంచి రంగుమారి వస్తున్న తాగునీరు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు
- ఆర్వో ప్లాంట్ల వద్ద నీటిని కొని తాగుతున్న ప్రజలు
- వాంబే కాలనీలో నెలకొన్న పరిస్థితి ఇదీ..



కుళాయి నుంచి రంగుమారి వస్తున్న నీరు



రంగు మారిన నీరు

పాయకాపురం(విజయవాడరూరల్): పేద ప్రజలు నివసించే వాంబే కాలనీకి విజయవాడ నగరపాలక సంస్థ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు రంగు మారి వస్తోంది. ఈ కలుషిత నీరు తాగేందుకు వీలులేకుండా ఉందని స్థానికులు వాపోతున్నారు. నగరపాలక సంస్థ రోజూ ఉదయం, సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు రెండు విడతలుగా కుళాయిల ద్వారా సాగునీరు సరఫరా చేస్తోంది. అయితే నీరు రంగు మారి పచ్చగా వస్తోంది. నీటి నుంచి దుర్వాసన కూడా వస్తుండటతో వాంబే కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. కలుషితమైన ఈ నీటిని ఎలా తాగాలని ప్రశ్నిస్తున్నారు. నగరాన్ని ఆనుకునే కృష్ణా నది ఉన్నా నగరపాలక సంస్థ అధికారులు బోరు నీటిని సరఫరా చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

పన్నుల వసూళ్లపైనే శ్రద్ధ

వాంబే కాలనీకి తాగునీటి సరఫరా విషయంలో నగరపాలక సంస్థ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటి పన్ను, నీటి పన్నులు వసూలు చేయడం చూపిస్తున్న శ్రద్ధను పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయడంలో ఎందుకు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇంటి పన్ను, నీటి పన్నులను ఏడాదికి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ లెక్కన ఒక్క హెచ్ బ్లాకులో నివసిస్తున్న 1440 కుటుంబాల వారు ఏడాదికి సుమారు రూ.43 లక్షల చొప్పున చెల్లిస్తున్నామని, అయినా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడంలో అధికారులు శ్రద్ధ తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

డయేరియాపై ఆందోళన

ఇటీవల న్యూరాజరాజేశ్వరిపేటలో డయేరియా ప్రబలి వందలాది మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలయ్యారు. పలువురు డయేరియాతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో తమ ప్రాంతానికి నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్ననీరు కలుషితమై వస్తుండటంతో వాంబేకాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న నీరు అంట్లు తోముకోవడానికి, బట్టలు శుభ్రం చేసుకోవడానికి మాత్రమే వినియోగిస్తున్నామని చెబుతున్నారు. ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల వద్ద 20 లీటర్ల టిన్ను నీటిని రూ.15 చొప్పున కొనుగోలు చేసి తాగుతున్నామని పేర్కొన్నారు. రోజుకు రూ.15 చొప్పున చెల్లించి నీటిని తాగడం తమకు భారంగా మారిందని వాపోతున్నారు. ఆర్వో ప్లాంట్ల నీటిని తాగుతున్నా, ఆ నీటిని కూడా పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తున్నారో లేదోనని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. స్వచ్ఛమైన తాగునీటిని నగరపాలక సంస్థ అధికారులు సరఫరా చేయలేకపోతున్నారని ఆరోపిస్తున్నారు. తాగు నీటి ద్వారా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని, పరిశుభ్రమైన నీటిని తాగాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న కలుషిత నీటిని ఎలా తాగాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

నీరు రంగుమారింది



వాంబే కాలనీలో కుళాయిల నుంచి సరఫరా అవుతున్న నీరు రంగుమారి వస్తోంది. నీటి నుంచి దుర్వాసన వెలువడుతోంది. కలుషితమై వస్తున్న తాగునీటిని తాగలేకపోతున్నాం. ఈ నీటిని తాగితే వ్యాధుల బారిన పడతామన్న భయంతో ఆర్వో ప్లాంట్ల వద్ద తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సురక్షిత తాగునీటిని సరఫరా చేయలి.

– బొమ్మారెడ్డి రాజ్యలక్ష్మి, వాంబేకాలనీ

నీటిని కొనడం భారం



కుళాయిల ద్వారా వస్తున్న నీటిని తాగలేకపోతున్నాం. నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న నీటిని వాడుక అవసరాలకు వినియోగించాలన్నా భయంగా ఉంది. వ్యాధుల బారిన పడతామన్న భయంతో ఆర్వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నాం. ఆర్వో ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేయాలంటే నెలకు రూ.600 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఖర్చు నిరుపేదలమైన మాకు భారంగా మారింది.

– ఎం.వెంకటలక్ష్మి, వాంబేకాలనీ

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



తాగునీటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రక్షిత మంచినీటిని మాత్రమే వినియోగించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం ఆరోగ్యానికి మంచిది. ప్రజలు తప్పనిసరిగా ఈ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ ఖాజా ఇంతియాతుల్లా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్ 11 వీ బందర్ రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అట్లా రత్తయ్య వీధి, గోపాల్‌రెడ్డి రోడ్డు, మేరీ వీధి, గూడవల్లి వారి వీధి, అలీబేగ్ వీధి, బైరెడ్డి రామన్న వీధి, రాజగోపాలాచారి వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

27 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 27 మందిపై రెండు, నాలుగో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదుచేశారు. 27 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు తొమ్మిది మందికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 18 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు.

న్యూఆర్‌ఆర్‌పేటలో కోటి సంతకాల సేకరణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో బుధవారం జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి స్థానికుల నుంచి సంతకాలను సేకరించారు. స్థానిక నాయకులు భోగాది మురళి, ఇసరపు రాజు, ఆదినారాయణ, పఠాన్ నజీర్‌ఖాన్, పులి దుర్గారావు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

గాయని బాల సరస్వతికి శ్రద్ధాంజలి

విజయవాడ కల్చరల్: గాయని బాలసరస్వతి మృతి బాధాకరమని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ రావు బాలసరస్వతికి మహాకవి శ్రీశ్రీ పురస్కారం ప్రకటించిందని, అనారోగ్య కారణాలతో ఆమె ఆ పురస్కారం అందుకోలేకపోయారని గుర్తుచేశారు. తన మధుర స్వరంతో ఎన్నో పాటలకు జీవం పోసిన ఆమె మృతి తెలుగు చిత్రసీమకు తీరని లోటని సాహితీ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నావల్లభరావు పేర్కొన్నారు.

రఘుపతి వెంకయ్యకు ఘన నివాళి

విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆశిష్ స్టూడియోలో తెలుగు చలన చిత్ర పితామహుడు రఘుపతి వెంకయ్య జయంతి వేడుకలు జరిగాయి. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో వెంకయ్య చలన చిత్రాలకు ఊపిరిపోశారని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి పేర్కొన్నారు. 1921లో భీష్మప్రతిజ్ఞతో తెలుగు సినిమా చరిత్ర ప్రారంభమైందన్నారు. విశ్రాంత పోలీస్ అధి కారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ.. వెంకయ్య సినీ రంగసేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డ్‌ను 1980లో ప్రారంభించిందన్నారు. అనంతరం గాయనీగాయకులు వి.కామేశ్వరి, సీత, లక్ష్మణ్‌నాయక్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, ప్రసూనా రామన్, బి.వీరభద్రరావు, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



సంతకాలు సేకరిస్తున్న మల్లాది విష్ణు తదితరులు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రానికి తీసుకొచ్చిన వైద్య కళాశాలను ప్రైవేటుకు ధారాదత్తం చేసే చర్యలే ఇందుకు నిదర్శనమన్నారు. 29వ డివిజన్ మధురానగర్ నేతాజీ కాలనీలో బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ జరిగింది. మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరిస్తూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్య కళాశాలలను తీసుకురావటంతో పాటు ఐదు కాలేజీల నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. కొన్ని మెడికల్ కళాశాలలు తుది దశకు చేరుకున్నా టీడీపీ నేతలు అసలు మెడికల్ కళాశాలలు ఎక్కడ ఉన్నాయంటూ మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని టీడీపీ నేతలకు హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వమే వైద్యకళాశాలలు నిర్మించాలి

ప్రభుత్వమే వైద్యకళాశాలలను నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా తమకు కావాల్సిన వారి కోసం మెడికల్ కళాశాలను ధారాదత్తం చేసేందుకు కూటమి పెద్దలు సిద్ధమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం పోలింగ్ బూత్ అధ్యక్షుడు కంభం కొండలరావు, నాయకులు ఎస్‌కే బాబు, డి.సుధాకర్, జాక్సన్, పూర్ణిమ, బోనం నాగు, కోలా రమేష్, గోవిందు, జయలక్ష్మి, వాసు, అక్బర్ పాల్గొన్నారు.

16వ డివిజన్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ తలపెట్టిన సంతకాల సేకరణ బుధవారం 61వ డివిజన్ వాంబేకాలనీలో జరిగింది. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు నాలం బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాలంటీర్ల వింగ్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్.ఎస్.నాయుడు, నాయకులు వెంకటేశ్వరరావు, బి.కల్యాణి, డి.రాంబాబు, ఎం.వి.వెంకటలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, మల్లేశ్వరి, నీలాపు దుర్గాప్రసాద్‌రెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రాజీవ్ నగర్‌లో..

పార్టీ 63వ డివిజన్ అధ్యక్షులు పసుపులేటి యేసు ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్, నిదానంపాటి లక్ష్మీ అమ్మ వారి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో సంతకాల సేకరణ చేశారు. పార్టీ నాయకులు మాన్యం జగదీష్, ఎం.నాగేశ్వరరావు, ఎస్‌కే అలీ, ఆర్.యేసు, లావణ్య కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనితోపాటు ప్రపంచ పోస్టల్ దినోత్సవ వేడుకలు జరిగాయి. తొలుత ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తపాలా శాఖ విడుదల చేసిన తో పాటు దేశ, విదేశాల్లో విడుదల చేసిన పలు రకాల స్టాంప్స్ ప్రదర్శించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, పాఠశాల విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొని స్టాంప్‌లను ఆసక్తిగా తిలకించారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అనిల్‌కుమార్, సింహాద్రి రామలింగేశ్వరరావు పోస్టల్ దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. బ్రెయిలీ లిపికి సంబంధించిన స్టాంప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాళపత్ర గ్రంథాలయను పోలిన కవర్లను ప్రదర్శించారు. జాతీయ పోస్టల్ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రామమోహన గ్రంథాలయంలో..

రామమోహన గ్రంథాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ కమిటీ కార్యదర్శి వేములపల్లి కేశవరావు, కార్యవర్గ సభ్యులు చిగురుపాటి నరేష్, కోట కృష్ణ భగవాన్, గ్రంథాలయ ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, పి.చిదంబరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ కలామ్

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి కండ్రికలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగింది. కలామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ.. పేదరికంలో పుట్టి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి కలాం అని గుర్తుచేశారు. సయ్యద్ మౌలాలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేదరాలు ఆయేషా సిద్దిక కుటుంబానికి నిత్యావసర సరుకులు కొనుగోలుకు ఆర్థిక సాయం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా సాజిద్ అలీ, సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి, పలు డివిజన్ల ప్రతినిధులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

వాంబే కాలనీలో చోరీల భయం

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో వరుస దొంగతనాలతో ప్రజలు భయపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చోరీలు జరిగిన ఫ్లాట్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ నెల 14వ తేదీన హెచ్‌బ్లాక్ 13వ అపార్టుమెంట్లో రాజ్యలక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది. ప్రైవేటు ఆస్పత్రిలో ఆయాగా పని చేస్తున్న ఆమె నైట్ డ్యూటీకి వెళ్లింది. ఇంట్లో బీరువాలో దాచుకున్న రూ.1.5 లక్షలను దొంగలు చోరీచేశారు. ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, క్లూస్ టీమ్ వస్తుందని చెప్పి రెండు రోజులు గడిచినా పత్తాలేదని బాధితులు మల్లాది విష్ణుకు చెప్పి కంటనీరు పెట్టుకుంది. హెచ్ బ్లాక్ 15వ అపార్టుమెంట్ శ్యామల ఇంట్లో దొంగలు పడి బీరువాను పగుల గొట్టి సామాన్లు చిందర వందర చేసి నగదు దొంగిలించారు. వరుస దొంగతనాలను పోలీసులకు తెలిపినా ఫలితం లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అదే రోజు అయిదు అపార్టుమెంట్లలో దొంగతనాలు జరిగాయని స్థానికులు మల్లాదికి తెలిపారు.

చేతుల పరిశుభ్రతపై జీజీహెచ్‌లో అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్లోబల్ హ్యాండ్ హైజీన్ డే సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలో బుధవారం చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చేతులను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో తెలియజేసే పోస్టర్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేతుల శుభ్రత వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో, వ్యాధుల సంక్రమణలను తగ్గించడంలో కీలకమన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ జి.వి.వి.ఎస్.సత్యనారాయణ, ఏడీ జయలక్ష్మి, మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అంకిత, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హాస్పిటల్ ఫ్యాకల్టీ సభ్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు చేతులు శుభ్రం చేసుకునే సరైన పద్ధతులను ప్రదర్శించారు.

వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు గుణపాఠం తప్పదు



బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు తదితరులు

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభలో మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. 26వ డివిజన్ మారుతీనగర్‌లో బుధవారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డితో కలిసి మల్లాది విష్ణు పాల్గొని ప్రసంగించారు. కూటమి పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని, ఏ చిన్న పని కావాలన్నా కాసులు లేనిదే జరగటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పే మాటలకు.. చేసే పనులకు పొంతన ఉండదన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం రంగాలను చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 26వ డివిజన్ వాసులకు రూ.22.30 కోట్ల మేర సంక్షేమం జరిగిందని మల్లాది విష్ణు గుర్తుచేశారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిదని పేర్కొన్నారు. ఏమీ చేయకుండానే అన్ని హామీలు అమలు చేశానని ప్రజలను మభ్యపెట్టే చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు.

విసుగెత్తిన జనం

చంద్రబాబు ప్రభుత్వ పాలన తీరుతో ప్రజలు విసుగెత్తిపోయారని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తమను మోసం చేస్తున్న చంద్రబాబు తీరును ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కోటి సంతకాల సేకరణలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంతకాలు చేయటం చంద్రబాబు పాలన ఎంత దారుణంగా ఉందో తేటతెల్లం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్-1 అధ్యక్షుడు పిల్లుట్ల వంశీ, నాయకులు టి.రాఘవ, కోలా నాగాంజనేయులు, పసుపులేటి కోటేశ్వరరావు, సోమాజీ, దుర్గారావు, సూరిబాబు, రమణ, భవానీ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత, నాణ్యత ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

వీఎంసీ యూసీడీ పీఓ వెంకట నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట నారాయణ

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఫుడ్ వెండింగ్ చేస్తున్న వీధి వ్యాపారస్తులు ఆహార భద్రత, నాణ్యత ధ్రువీకరణ పత్రం పొందటం తప్పనిసరని నగరపాలక సంస్థ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పిడుగు వెంకట నారాయణ అన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుడ్ వెండింగ్ చేస్తున్న సుమారు 500 మంది వీధి వ్యాపారస్తులకు ఆహార భద్రత, నాణ్యత అథారిటీ ఆఫ్ ఇండియా, సౌత్ రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని పీఎం స్వానిధి 2.0 ద్వారా బ్యాంక్ రుణాలు ఇస్తారని తెలిపారు. ఈ రుణాలు మొదటి విడతగా రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడవ విడతలో రూ.50 వేలు, క్రెడిట్ కార్డ్ ద్వారా రూ.30 వేలు అందిస్తారని వివరించారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైనవారికి యాప్రాన్, మాస్కులు, టోపీలతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ డాక్టర్ ఆంజనేయులు చాగంటి, కె.సాయి శివ, టెక్నికల్ ఆఫీసర్, ఆహార భద్రత, నాణ్యత అథారిటీ ఎస్.రమేష్‌బాబు, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జీఎస్ లక్ష్మణరావు, ఎస్‌బీఐ డెప్యూటీ మేనేజర్ ఎస్.శివరామ్ తదితరులు పాల్గొన్నారు.